నేటి మ్యాచ్ | భారత్ X బంగ్లాదేశ్ | మ.2.30 నుంచి



# స్వర్ణ దీప్తి

## జాతీయ పారా అథ్లెటిక్స్ టోర్నీ




హైదరాబాద్, ఆట ప్రతినిధి: చెన్నై వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్టార్ అథ్లెట్ జివాంజీ దీప్తి తెలంగాణకు తొలి పతకాన్ని అందించింది. బుధవారం జరిగిన మహిళల 400 టీ20 మీటర్ల రేసును దీప్తి 57.85 సెకన్లలో ముగించి పసిడి పతకంతో మెరిసింది. ఇదే విభాగంలో హర్యానాకు చెందిన పూజ (1:08:21సె), భువీ అగర్వాల్ (1:09:24సె) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

# ఢిల్లీ ధనాధన్

**మెరిసిన మెగ్ లానింగ్**

**యూపీకి రెండో ఓటమి**

వడోదర: ఢిల్లీ క్యాపిటల్స్ బంతితో పాటు బ్యాట్‌తోనూ అదరగొట్టడంతో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఆ జట్టు రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం ఇక్కడ యూపీ వారియర్స్‌తో చివరి బంతి వరకూ ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో క్యాపిటల్స్.. ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. యూపీ నిర్దేశించిన 167 పరుగుల లక్ష్యాన్ని మరో బంతి మిగిలుండగానే ఛేదించింది. ఛేదనలో క్యాపిటల్స్ సారథి మెగ్ లానింగ్ (69), అన్నాబెల్ (41 నాటౌట్) మరిజన్నె కాప్ (29 నాటౌట్) దూకుడుగా ఆడారు. మొదట బ్యాటింగ్ చేసిన యూపీ.. కిరణ్ నవగిరె (51), శ్వేతా (37), హెన్రీ (33) రాణించడంతో పోరాడగలిగే స్కోరును సాధించింది.



లానింగ్ (69)

ఈ టోర్నీలో యూపీకి ఇది వరుసగా రెండో ఓటమి. కాగా యూపీ, ఢిల్లీ పోరుతో వడోదరలో డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు ముగిశాయి. శుక్రవారం నుంచి ఈ టోర్నీ బెంగళూరులో మొదలుకానుంది.

## జూడో క్రీడాభివృద్ధికి కృషి

**రాష్ట్ర సంఘం చైర్మన్ బండ ప్రకాశ్**

కొత్తపల్లి, ఫిబ్రవరి 19: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామగ్రామాన జూడో క్రీడకు ఆదరణ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, రాష్ట్ర జూడో సంఘం చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లో రాష్ట్ర జూడో సంఘం కార్యవర్గ సమావేశంతో పాటు నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ సమావేశానికి



ఆయన హాజరై, మాట్లాడారు. రాష్ట్రంలో జూడో క్రీడాకారులకు కొదువలేదని, భవిష్యత్‌లో ఒలింపిక్ స్థాయికి ఎదగాలన్నారు. 38వ జాతీయ క్రీడల్లో తెలంగాణ జూడో క్రీడాకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

## ఎస్ఆర్‌హెచ్ సహకారంతో టీపీఎల్



హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్రంలో ప్రతిభ కల్గిన ప్లేయర్లను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో త్వరలో మొదలుకానున్న తెలంంగాణ ప్రీమియర్ లీగ్(టీపీఎల్)కు సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) సహకరించాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు కోరారు. బుధవారం స్టేడియంలో ఎస్ఆర్‌హెచ్ మేనేజ్‌మెంట్‌తో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు సమావేశమయ్యారు. ఇందులో ప్రధానంగా రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి సహకరించాలని ఎస్ఆర్‌హెచ్‌కు జగన్ విజ్ఞప్తి చేశారు. ఐపీఎల్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉప్పల్ మల్టి లెవల్ పార్కింగ్ సౌకర్యానికి సహకారం అందించాలన్నారు.



# గిల్ @1

దుబాయ్: ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ నంబర్‌వన్ ర్యాంక్‌లోకి దూసుకొచ్చాడు. పాకిస్థాన్ మాజీ సారథి బాబర్ ఆజమ్‌ను అధిగమించిన గిల్.. 796 పాయింట్లతో ఫస్ట్ ర్యాంకు దక్కించుకున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో ముగిసిన వన్డే సిరీస్‌లో రెండు అర్ధ సెంచరీలు, ఓ సెంచరీ చేయడంతో అతడి ర్యాంకింగ్ మెరుగైంది. ఈ జాబితాలో రోహిత్ మూడో ర్యాంక్‌లో ఉండగా కోహ్లీ ఆరు, శ్రేయస్ తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్ల విషయానికొస్తే లంక స్పిన్నర్ తీక్షణ అగ్రస్థానంలో ఉండగా భారత్ నుంచి కుల్‌దీప్ యాదవ్ నాలుగో స్థానంలో చోటు దక్కించుకున్నాడు.

## విదర్భకు భారీ ఆధిక్యం

**కేరళకు దీటుగా బదులిస్తున్న గుజరాత్**



వడోదర: రంజీ ట్రోఫీ-2024 సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ముంబైకి షాకిచ్చేందుకు విదర్భ అన్ని అస్ర్తాలనూ సిద్ధం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో రహానే సేనను 270 పరుగులకే ఆలౌట్ చేసి 113 పరుగుల భారీ ఆధిక్యాన్ని దక్కించుకున్న విదర్భ.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 147/4 స్కోరు చేసింది. ప్రస్తుతం ఆ జట్టు 260 పరుగుల ఆధిక్యంలో ఉంది. యశ్ రాథోడ్ (59 బ్యాటింగ్), కెప్టెన్ అక్షయ్ (31 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మరో రెండు రోజులు మిగిలున్న ఈ మ్యాచ్‌లో విదర్భను ఆలౌట్ చేయడంతో పాటు లక్ష్యాన్ని ఛేదించడం ముంబైకి అంత తేలిక కాదు. ఒకవేళ ఈ మ్యాచ్ డ్రాగా ముగిసినా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో విదర్భ ఫైనల్‌కు దూసుకెళ్తుంది. ఇక కేరళతో జరుగుతున్న మరో సెమీస్‌లో గుజరాత్ దీటుగా బదులిస్తోంది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేరళ 457 పరుగుల భారీ స్కోరు చేయగా గుజరాత్ 222/1 స్కోరు చేసింది.

# ఆరంభం అదరాలి

## నేడు భారత్, బంగ్లాదేశ్ మధ్య పోరు • టైటిల్ వేట మొదలుపెట్టనున్న టీమ్‌ఇండియా • ఫేవరెట్‌గా రోహిత్ సేన



మ. 2:30 గం.ల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో లైవ్


దుబాయ్: గతేడాది ఐసీసీ టీ20 ప్రపంచకప్ నెగ్గి భారత క్రికెట్ అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించిన రోహిత్ సేన.. మరో కీలక టోర్నీకి సిద్ధమైంది. వన్డే ఫార్మాట్‌లో 'మినీ ప్రపంచకప్'గా గుర్తింపు పొందిన చాంపియన్స్ ట్రోఫీని ఎనిమిదేండ్ల క్రితం తృటిలో చేజార్చుకున్న భారత్.. దానిని తిరిగి దక్కించుకునే దిశగా బుధవారం నుంచి టైటిల్ వేటను ఆరంభించనుంది. పాకిస్థాన్/దుబాయ్ వేదికలుగా జరుగుతున్న ఈ టోర్నీ 9వ ఎడిషన్‌లో భాగంగా.. మెన్ ఇన్ బ్లూ గురువారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. టోర్నీ ఫేవరేట్లలో ఒకటిగా బరిలో ఉన్న టీమ్‌ఇండియాకు బంగ్లాదేశ్ ఏ మేరకు సవాలు విసురుతుందనేది ఆసక్తికరం.

### జోరు మీదున్న బ్యాటర్లు

ఇంగ్లండ్‌తో సొంతగడ్డపై జరిగిన వన్డే సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన భారత్.. రెట్టించిన ఉత్సాహంతో చాంపియన్స్ బరిలో నిలిచింది. బ్యాటింగ్ విభాగంలో టీమ్‌ఇండియాకు కష్టాలేం లేవు. కొంతకాలంగా ఫామ్ కోల్పోయి తంటాలు పడ్డ దిగ్గజ బ్యాటర్లు రోహిత్, కోహ్లీ ఇంగ్లండ్ సిరీస్‌తో టచ్‌లోకి వచ్చారు. ఓపెనర్ గిల్ కూడా రెండు అర్ధ సెంచరీలు, ఓ శతకంతో జోరుమీదున్నాడు. దేశవాళీలో అదరగొట్టి జాతీయ జట్టులోకి వచ్చిన శ్రేయస్ అయితే నెక్స్ట్ లెవల్ దూకుడుతో సాగుతున్నాడు. అయితే వచ్చిన సమస్యల్లా ఐదో స్థానంలో ఎవరిని ఆడించాలనేదే! ఇంగ్లండ్‌తో సిరీస్‌లో భాగంగా తొలి రెండు వన్డేలలో టీమ్ మేనేజ్‌మెంట్.. అక్షర్‌ను ఐదో స్థానంలో పంపించి సక్సెస్ అయింది. మళ్లీ మూడో వన్డేలో రాహుల్‌ను ఇదే స్థానంలో ఆడిస్తే అతడూ తనకు అచ్చొచ్చిన స్థానంలో మెరిశాడు. మరి చాంపియన్స్ ట్రోఫీలో ఐదో స్థానంలో ఎవరిని ఆడిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

### పేసర్లు ఏం చేసేనో?

బ్యాటింగ్ విభాగంలో భారత్‌కు ఇబ్బందుల్లేకపోయినా బౌలింగ్ విభాగం మాత్రం కాస్త వీక్‌గా ఉంది. బుమ్రా గైర్హాజరీ నేపథ్యంలో సీనియర్ పేసర్ మహ్మద్ షమీపై భారం పడనుంది. అతడికి అండగా హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌ను ఎంపికచేసినా ఈ ఇద్దరికీ అంతర్జాతీయ స్థాయిలో వన్డేలు ఆడిన అనుభవం తక్కువ. అదీగాక ఆరంభంలో భారీగా పరుగులిచ్చుకునే బలహీనత ఇద్దరిలోనూ ఉంది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో హర్షిత్ వికెట్లు పడగొట్టినా ఈ టోర్నీలో అర్ష్‌దీప్ వైపే మేనేజ్‌మెంట్ మొగ్గుచూపే అవకాశముంది. బంతిని రెండువైపులా స్వింగ్ చేయడంలో అతడు సిద్ధహస్తుడు. ఇక పేస్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. నెమ్మదిగా స్పందించే దుబాయ్ పిచ్‌లపై స్పిన్నర్లు కీలక పాత్ర పోషించే అవకాశాలున్న నేపథ్యంలో భారత్ ముగ్గురు స్పిన్నర్ల ఫార్ములాతో బరిలోకి దిగొచ్చు. ఈ టోర్నీలో భారత్ ఏకంగా ఐదుగురు స్పిన్నర్లకు జట్టులో చోటు కల్పించింది. అక్షర్, జడేజా, కుల్‌దీప్, వరుణ్, వాషింగ్టన్‌లో ఎవరికి ఆ అదృష్టం వరిస్తుందనేది చూడాలి.



### బంగ్లాకు కఠిన సవాలు

2023 వన్డే ప్రపంచకప్ తర్వాత 12 వన్డేలు ఆడిన బంగ్లాదేశ్.. నాలుగు మాత్రమే గెలిచింది. లిటన్ దాస్, షకిబ్‌అల్ హసన్ వంటి స్టార్లు లేకపోయినా ముష్ఫికర్, మిరాజ్, నహిద్ రాణా, టస్కిన్ అహ్మద్ వంటి ప్రతిభావంతమైన ఆటగాళ్లు ఆ జట్టు సొంతం. తమదైన రోజున ఏ జట్టునైనా సవాల్ చేయగల సత్తా బంగ్లాదేశ్ సొంతం. కానీ నిలకడలేమి ఆ జట్టుకు ప్రధాన శత్రువు. ఈ నేపథ్యంలో భారత్‌ను బంగ్లా ఏ మేరకు నిలువరిస్తుందనేది ఆసక్తికరం.

# కివీస్ అదుర్స్

**పాకిస్థాన్‌కు పరాభవం**

**యంగ్, లాథమ్ శతకాలు**



లాథమ్ (118 *)



విల్ యంగ్ (107)

కరాచీ: స్వదేశంలో జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య పాకిస్థాన్‌కు మొదటి మ్యాచ్‌లోనే షాక్ తగిలింది. బుధవారం కరాచీలోని నేషనల్ స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 60 పరుగుల తేడాతో పరాభవం పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన కివీస్.. 50 ఓవర్లలో 5 వికెట్లకు 320 పరుగుల భారీ స్కోరు చేసింది. విల్ యంగ్ (107), టామ్ లాథమ్ (118 నాటౌట్) శతకాలతో మెరవగా గ్లెన్ ఫిలిప్స్ (39 బంతుల్లో 61, 3ఫోర్లు, 4సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఛేదనలో పాక్.. 47.2 ఓవర్లలో 260 పరుగులకు కుప్పకూలింది. ఖుష్‌దిల్ షా (69) పోరాడినా అతడికి సహకరించేవారు కరువవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. బాబర్ (90 బంతుల్లో 64) మరీ నెమ్మదిగా ఆడాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌కు 73 పరుగులకే ముగ్గురు కీలక బ్యాటర్లు పెవిలియన్ చేరినా ఆ జట్టును యంగ్, లాథమ్ నిలబెట్టారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 118 పరుగులు జోడించారు. యంగ్ నిష్క్రమించినా అతడి స్థానంలో వచ్చిన ఫిలిప్స్ వేగంగా ఆడి కివీస్ భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. లాథమ్, ఫిలిప్స్ చివరి 10 ఓవర్లలో 113 రన్స్ రాబట్టారు. భారీ ఛేదనలో 22 పరుగులకే షకీల్ (6), రిజ్వాన్ (3) వికెట్లను కోల్పోవడంతో పాక్ నెమ్మదిగా ఆడింది. ఫలితంగా 28వ ఓవర్లో ఆ జట్టు వంద పరుగుల మార్కును అందుకుంది. సల్మాన్ అఘా (42) వేగంగా ఆడేందుకు యత్నించినా అతడి నిష్క్రమణతో పాక్ బ్యాటర్లు తడబడ్డారు. 81 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన బాబర్‌ను సాంట్నర్ పెవిలియన్‌కు పంపాడు. చివర్లో ఖుష్‌దిల్ భారీ మెరుపులతో పాక్ విజయంపై ఆశలు రేపినా.. ఓరూర్కే అతడిని ఔట్ చేయడంతో పాక్ ఓటమి ఖరారైంది.

# అబ్బాయిలు గెలిచినా..

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత హాకీ జట్లకు బుధవారం మిశ్రమ ఫలితాలు దక్కాయి. అబ్బాయిల జట్టు జర్మనీపై గెలిచి మంగళవారం నాటి ఓటమికి బదులు తీర్చుకోగా.. అమ్మాయిలు స్పెయిన్ చేతిలో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడారు. హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 1-0తో జర్మనీని ఓడించింది. గుర్జాంత్ సింగ్ ఆట 4వ నిమిషంలోనే గోల్ కొట్టాడు. అమ్మాయిలు 0-1తో స్పెయిన్ చేతిలో ఓడారు.





72198 21111 | SECURE
*Terms and conditions apply. *Ex-showroom price for Pulsar 125 variants. Bajaj Auto reserves the right to withdraw any or all offers without prior notice. Stunts have been performed by experts, under professional supervision, in a controlled and enclosed environment, in isolation from general public or public roads. Do not attempt to replicate these stunts and always follow traffic and safety rules. AMC available on specific models and in specific states. Check with Bajaj dealer for more details. Road Side Assistance is provided by third parties and is subject to their terms and conditions.
Authorised Dealers for Bajaj Auto Ltd. Karimnagar STANDARD BAJAJ, VENKAT BAJAJ • Mancherial MAHI BAJAJ • Adilabad SRK MOTORS • Authorised Service Centre: Jagithyal, SIRCILLA, METPALLY, KORUTLA, HUSNABAD, HUZURABAD, JAMMIKUNTA, KALWACHERLA, KATARAM, VEMULAWADA, PEDDAPALLY, ARMOOR, Balkonda, Barowada, Nandipet, BODHAN, KAMAREDDY, Kamarpally, RAMAGUNDAM, JANNARAM, BELLAMPALLI, KAGAZNAGAR, ASIFABAD, CHENNUR, LUXETTIPET, NIRMAL, Ichoda, Utnoor, NIRMAL, BHAINSA, KHANAPUR, KADEM, GAJWEL, MEDAK, SIDDIPET, PITLAM